క్లుప్తంగా

15న జియారత్


వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం.

కర్నూలు(రాజ్‌విహార్): మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా సొల్లెల్లాహు అలైహి వసొల్లం జియారత్ సందర్భంగా ఈ నెల 15వ తేదీన జియారత్ ఏ ము ఏ ముబారక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముస్లిం మత గురువు సయ్యద్ ముబష్షిర్ పాషా ఖాద్రీ అన్నారు. బుధవారం ఆయన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. స్థానిక అశోక్ నగర్‌లోని ట్రినిటీ స్కూల్ పక్కన ఉన్న ఖమర్ మంజిల్‌లో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నిర్వహకులు సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ, నూరుల్లా ఖాద్రీ, మాసూం ఖాద్రీ పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీ శివారెడ్డి

కర్నూలు (టౌన్) : నగరపాలక డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీ శివారెడ్డి నియమితులయ్యారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్యాడర్లలో పదోన్నతులు కల్పించి మున్సిపల్ కమిషనర్లుగా బదిలీ చేసింది. ఆంధ్రప్రదేశ్ సచివాలయం బీసీ సంక్షేమ శాఖ లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయనకు గ్రేడ్ -1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటీ కమిషనర్‌గా నియమించింది.

ఆత్మహత్యకు పురిగొల్పిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పద్మావతి అనే సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి పురిగొల్పిన సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధా న కార్యదర్శి ఎండీ. అంజిబాబు డిమాండ్ చేశా రు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మావతిని బుధవారం ఆయన పరామర్శించి సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు రాజశేఖర్, ప్రభాకర్, మహమ్మద్, రామకృష్ణ ఉన్నారు.

15న 'భువన విజయం' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో 'భువ న విజయం'నాటక ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. బనవాసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులచే(బాలికలు) ఈప్రదర్శన ఉంటు ందని పేర్కొన్నారు. కళాభిమానులు, కళాపోషకులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ సభ వాయిదా

కర్నూలు(సెంట్రల్): ఈనెల 21వ తేదీన మంత్రాలయంలో నిర్వహించాల్సిన కాంగ్రెస్ సాధికారత సభను వాయిదా వేసినట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా అనుకున్న ప్రకారం 21వ తేదీన మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో మంత్రాలయంలో 21వ తేదీన సభ నిర్వహించాల్సి ఉందన్నారు.అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ రావడంతో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే బిజీగా ఉండడంతో వాయిదా పడినట్లు చెప్పారు.

వ్యవసాయ రంగ సంక్షోభంపై సదస్సు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సంక్షోభం-ప్రత్యామ్నా య విధానాలు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును నేడు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సదస్సుకు అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సెంట్రల్ యూనివర్సిటీ (హైదరాబాద్) ప్రొఫెసర్ ఎన్. పురేంద్ర ప్రసాదు హాజరవుతున్నట్లు చెప్పారు.

ఉర్దూ వర్సిటీకి పక్కా భవనాలు నిర్మించండి

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయానికి సొంత భవనాలు, హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని ఆవాజ్ కమిటీ నగర గౌరవ అధ్యక్షుడు ఇస్మాయిల్, నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన వర్సిటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీతో సమావేశమై యూనివర్సిటీ సమస్యలపై చర్చించారు.

కదలనివ్వదు...నడవనివ్వదు !

- ఉదయం లేవగానే కీళ్లలో బిగుతు
- కాళ్లు, చేతులు కదల్చాలంటే బాధ
- పెరుగుతున్న కీళ్లవాత సమస్యలు
- జిల్లాలో 15 శాతం మందికి సమస్య
- జీవనశైలి, వంశపారం పర్యం కారణాలు
- నేడు వరల్డ్ ఆర్థరైటిస్ డే

ఎక్కువసేపు కూర్చుని లేచి నడవాలంటే కష్టం. రాత్రిపూట నిద్రలో మెలకువ వచ్చి లేచి నాలుగు అడుగులు వేయాలన్నా నరకం. ఉదయం లేచినప్పటి నుంచి అరగంట వరకు కీళ్లు పట్టేసి నడవనివ్వకుండా...కదలనివ్వకుండా చేస్తాయి. ఇలాంటి సమస్యలతో ఇటీవల కాలంలో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. జీవనశైలిలో మార్పు, ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, వ్యాయామం లేకపోవడం తదితర కారణాలు కీళ్లవాతానికి దారి తీస్తున్నాయి. నేడు వరల్డ్ ఆర్థరైటిస్(కీళ్లవాతం)డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువగా వినియోగమయ్యే మాత్రలు నొప్పుల మాత్రలంటే అతిశయోక్తి కాదు. ఎక్కువ మంది ఒళ్లునొప్పుల తర్వాత కీళ్లనొప్పులు వేధిస్తున్నాయని చెబుతూ చికిత్స కోసం వస్తుంటారు. వారికి అక్కడున్న వైద్యసిబ్బంది పారాసిటమాల్ లేదా డైక్లోఫినాక్ మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. ఆర్ఎంపీలైతే స్టెరాయిడ్, పెయిన్ కిల్లర్లు ఇచ్చి ఉపశమనం కలిగిస్తుంటారు. వీరి వద్దకు వచ్చే ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది కీళ్లనొప్పులు. ఇందులో కీళ్లలో కార్టిలేజ్ అరిగిపోవడం వల్ల వచ్చే కీళ్లనొప్పులు ఒకటైతే, శరీరంలోని వ్యాధినిరోధక శక్తి ఎదురు దాడి చేయడం వల్ల వచ్చే కీళ్లనొప్పులు. అంటే శరీరంలో విషవాయువులు అన్ని కీళ్ల సందుల్లో చేరి వాతాన్ని(నొప్పి)ని కలిగించి ఇబ్బంది పెడుతుంటాయన్న మాట. ఇలాంటి వ్యాధులకు చికిత్స అందించేందుకు రుమటాలజిస్టులతో పాటు ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఆయా వైద్యులు వారి వారి పరిజ్ఞానాన్ని బట్టి చికిత్స చేస్తూ రోగులకు ఉపశమనం కలిగిస్తున్నారు. జిల్లాలో 15 శాతం మంది కీళ్లనొప్పులు, కీళ్లవాతంతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. ఇవి వయస్సు పెరిగిన వారిలోనే వస్తుంటాయన్నది కూడా పూర్తిగా నిజం కాదు. చాలా మంది మధ్య వయస్కుల్లోనూ, కొంత మంది యువకుల్లోనూ కీళ్ల నొప్పులు కనిపిస్తుంటాయి.



కీళ్లవాతానికి కారణాలు

కొన్ని వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ల అసమతుల్యతలు, విటమిన్ లోపాలు, వాతావరణ కాలుష్యాలు ఇలా అనేక కారణాలతో కీళ్లనొప్పులు వస్తుంటాయి. సొంత కణాలపైనే తమ సొంత వ్యాధినిరోధక వ్యవస్థ ప్రతికూలంగా పనిచేసి, కణాలను దెబ్బతీయడం వల్ల వచ్చే కీళ్లవాతాలూ ఉన్నాయి. ఇలా వచ్చే వాటిని ఆటో ఇమ్యూన్ సమస్యలుగా పేర్కొంటారు. కొన్ని సందర్భాల్లో కీలకమైన అవయవాలు, వ్యవస్థలూ దెబ్బతినవచ్చు.

ఆటో ఇమ్యూన్ వ్యాధులు

ఆర్థరైటిస్‌లో ఆటో ఇమ్యూన్ వ్యాధులు ప్రధానమైనవి. ఆటో ఇమ్యూన్ సమస్యలతో మహిళల్లో కనిపించే వ్యాధుల్లో లూపస్ (ఎస్ఎల్), రుమటాయిడ్ ఆర్థరైటిస్, సొరియాటిక్ ఆర్థరైటిస్, సిస్టమిక్ స్కీరోసిస్, ఏషియన్ వంటివి ముఖ్యమైనవి.

లక్షణాలు

ముఖ్యంగా జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గిపోవడం, అలసట వంటివి ప్రారంభ లక్షణాలు. చేతులు, కాళ్లు, కీళ్లనొప్పులు, వాపులు ఉంటాయి. ఉదయం లేచిన వెంటనే 30 నిమిషాల కన్నా చర్మం బిగుతుగా ఉంటుంది. కీళ్లనొప్పులు, చర్మం దద్దుర్లు, నోటి పుండ్లు, జుట్టురాలిపోవడం, తీవ్రమైన కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె, నాడీ సమస్యలు, చర్మం బిగుతుగా ఉండటం, చేతి కొవ్వు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, రక్తం గడ్డకట్టడం, గర్భస్రావం వంటివి ముఖ్యమైన లక్షణాలు. కీళ్లవాతాలకు దాని రకాన్ని బట్టి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. ఈ లక్షణాలు అందరిలోనూ ఒకేలా బయటపడకపోవచ్చు. వ్యాధి రకాన్ని బట్టి తీవ్రతను బట్టి బాధితుల వయస్సు, వారి ఇతర వ్యాధులను బట్టి లక్షణాల తీరు మారుతూ ఉంటుంది.

ఇతర సమస్యలు

వీటిలో చాలావాటికి నివారణ ఉండదు. ఎందుకంటే ఇవి జన్యుపరమైనవి. జన్యులోపాలతో వచ్చేవి. ఈ కారణంతో ఈ పరిమితి ఉంటుంది. ఈ జన్యులోపాలకు పర్యావరణ కారణాలూ, జీవనశైలి తోడైనప్పుడు ఇవి బయటపడతాయి. అందుకే ఈ యేడాది నినాదాన్ని బట్టి మన చేతుల్లో ఉండే అంశాలేమిటో తెలుసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవడం చాలా వరకు మేలు చేయడంతో పాటు కొంత మేర నివారణకూ తోడ్పడేందుకు అవకాశం ఉంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

అధిక బరువు తగ్గించుకోవాలి. ఆరోగ్యకర జీవనశైలి పాటిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. పొగతాగడం, మద్యపానం అలవాటును పూర్తిగా మానేయాలి. కాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. కీళ్లవాతం వచ్చిన వారిలో ఒంటి కదలికలు చురుగ్గా ఉండేలా నడక వంటి వ్యాయామాలు చేయాలి. దాంపత్య జీవితానికి దూరంగా ఉండాలన్నది మరో అపోహ. ఇది వాస్తవం కాదు. బాధితులు తగిన జాగ్రత్తలు పాటించడం, వైద్యుల సూచనలను పాటిస్తూ జీవనశైలిని మెరుగుపరుచుకుంటే కీళ్లవ్యాధుల బాధల నుంచి దూరంగా ఉండవచ్చు.

ఒకే రకం మందులు పనిచేయవు



అన్ని రకాల కీళ్లవాతాలకూ ఒకే రకం మందులు పనిచేయవు. వ్యాధి తీవ్రత, ప్రభావితమైన అవయవం, బాధితులు స్త్రీనా, పురుషుడా అన్న అంశంతో పాటు ఒకవేళ బాధితులు మహిళలైతే వారు గర్భవతా లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాము. ఈ మేరకు ఆయా వ్యాధుల్లోని లక్షణాలను బట్టి మందులు, వాటి మోతాదులను రోగులకు సూచిస్తాము. ముఖ్యంగా రోగులు రోజూ వ్యాయామం చేయడం, జీవనశైలి మార్చుకోవడం, పరిమితిమేర ఆహారాన్ని తీసుకోవాలి.

–డాక్టర్ ఎ. సృజన, రుమటాలజిస్టు, కర్నూలు

కీళ్లనొప్పులకు భయపడాల్సిన పనిలేదు



కీళ్లనొప్పులకు ప్రస్తుతం భయపడాల్సిన పని లేదు. 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే కీళ్లమార్పిడి అవసరం అవుతుంది. 60 ఏళ్లలోపు వారికి పీఆర్‌పీ, స్టెమ్‌సెల్‌థెరపీ, ఏసీఎస్ వంటి ప్రొసీజర్లు అందుబాటులో ఉన్నాయి. కీళ్లవాతం, నొప్పులు తగ్గేందుకు డిసీజ్ మాడ్యుఫైయింగ్ యాంటి రుమటాయిడ్ డ్రగ్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల సాధారణ జీవితాన్ని గడపవచ్చు. ఇంకా మెరుగైన చికిత్స అందించేందుకు, మందులు కనుగొనేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి. వీటివల్ల మనిషి జీవితకాలం మరింత పెరుగుతుంది.

–డాక్టర్ జీవీఎస్ రవిబాబు, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

మహిళకు అరుదైన ఆపరేషన్

- ఆరోగ్యశ్రీలో ఉచితంగా నిర్వహణ

కర్నూలు(హాస్పిటల్): క్లోమం, పేగు, కాలేయం, ఉదరం కలిసే చోట క్యాన్సర్ గడ్డను కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా నిర్వహించిన ఈ శస్త్రచికిత్స వివరాలను సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ జానకిరామ్ బుధవారం వివరించారు. 'నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన లక్ష్మీదేవి(43)కి కామెర్లు తీవ్రస్థాయిలో వచ్చాయి. నంద్యాలలోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో కిమ్స్‌కు తీసుకొచ్చారు. ముందుగా ఆమెకు కామెర్లు తగ్గేందుకు ఎండోస్కోపి చేసి స్టెంట్ వేసి తగిన మందులు ఇచ్చాము. నెలరోజుల్లో కామెర్లు తగ్గాయి. అప్పటికే నిర్వహించిన పరీక్షల్లో ఆమెకు కాలేయం, క్లోము, పేగులు కలిసే చోట కణితి ఉన్నట్లు గుర్తించాము. ఏడు గంటల పాటు శ్రమించి విపుల్స్ ప్రొసీజర్ ద్వారా శస్త్రచికిత్స చేసి ఆ కణితిని తొలగించి పరీక్షలకు పంపగా క్యాన్సర్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమెకు కీమోథెరపి చికిత్సకు పంపించాము. ఈ మొత్తం ప్రక్రియను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆమెకు ఉచితంగా నిర్వహించాము' అని డాక్టర్ జానకీరామ్ తెలిపారు.

సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమే

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఏ ఒక్కరూ తక్కువ కాదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పీసీ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక దిన్నెదేవరపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. పురుషుడి కంటే స్త్రీ ఏ విషయంలోనూ తక్కువ కాదని చెప్పారు. అందుకే నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారని తెలిపారు. అయిన మన సమాజంలో ఆడశిశువుల పట్ల అనాదరణ ఇంకా తగ్గలేదన్నారు. దీనిని అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ– నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టంను అమలులోకి తీసుకొచ్చిందని వివరించారు. డెమో ప్రమీలాదేవి మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు, కిశోర బాలికల పెరుగుదల కోసం పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఎస్‌బీసీసీ శ్రీనివాసులు మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు సరైన వివాహ వయస్సు అని చెప్పారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణకుమారి, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

పెద్దాసుపత్రి ఏడీ రమేష్‌బాబు సరెండర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏడీ రమేష్‌బాబును డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేస్తూ బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా ఆసుపత్రి నిధుల దుర్వినియోగం, నిబంధనల మేరకు ఖర్చు పెట్టకపోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోకపోవడం, రికార్డులు, కార్యాలయ నిర్వహణలో వైఫల్యం, ఆసుపత్రి ఆదాయ, వ్యయాలకు సంబంధించి సరైన లెక్కలు చూపకపోవడం తదితర విషయాలను కారణంగా చూపిస్తూ ఆయనను సరెండర్ చేశారు. ఏడీ వ్యవహారంపై గతంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశాల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రస్తావించినా గతంలో ఉన్న అధికారులు పట్టించుకోలేదు. డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టాక అన్ని అంశాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తుండటంతో విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల స్టేషనరీ బిల్లుల విషయమై జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును సస్పెండ్ చేసిన విషయం విదితమే. స్టేషనరీ కొనుగోలు చేయకపోయినా చేసినట్లు, దొంగ కొటేషన్‌లతో బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పలు విషయాలను విచారణ కమిటీ గుర్తించి నివేదికలో నమోదు చేసినట్లు సమాచారం.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు

- జగనన్నకు చెబుదాం–స్పందనపై సమీక్షలో అధికారులతో డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చే అర్జీలపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా పరిష్కారాలు చూపాలని డీఆర్వో కె.మధుసూదనరావు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితో ఆయన స్పందన అర్జీల పరిష్కారాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీల రీ ఓపెన్ కాకుండా సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రతి శనివారం కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుందన్నారు. కాగా, అర్జీదారులను కార్యాలయానికి పిలిపించుకొని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్‌ను వారి చేతికి ఇచ్చి ముట్టినట్లు రీసీదు పొందాలని రాతపూర్వకంగా ఆదేశాలిచ్చామని, వాటిని ఎవరూ పాటించడంలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ముున్ముందు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని, లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదనరావు

అంగన్‌వాడీల్లో త్వరగా ఏసీఆర్‌లు పూర్తి చేయాలి

- పాఠశాలల్లో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ ఆడిట్
- అధికారులతో జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 81 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల (ఏసీఆర్) నిర్మాణాలను నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నాడు – నేడు ఫేజ్–2 పనుల పురోగతిపై ఆమె పీఆర్, ఏపీఎస్ డబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు, ఎంఈఓ, ఐసీడీఎస్ సీడీపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణాలతో పాటు 92 అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న మరమ్మతు పనులు 10 మండలాల్లో మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన 12 మండలాల్లో కూడా వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను పూర్తి చేసిన అనంతరం ఆయా కేంద్రాలను మహిళా శిశు సంక్షేమ శాఖకు అప్పగించాలన్నారు. అలాగే 312 పాఠశాలల్లో 1312 అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల చేత పనుల పురోగతిని ఫొటో క్యాప్చర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆ పనులకు చేస్తున్న వ్యయ వివరాలను ఆన్‌లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. సిమెంట్ కంపెనీలతో మాట్లాడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలకు సిమెంట్‌ను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. నాడు – నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో పిల్లలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ, ఎంఈఓలు కలిసి ఆయా పాఠశాలల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి రెండు వారాల్లోగా తనకు నివేదిక అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఏ పీఓ డా.వేణుగోపాల్, జిల్లా విద్యా శాఖాధికారి రంగారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె. సుబ్రమణ్యం, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బి. నాగేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ప్రసాద్, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ పి. వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

కర్నూలు కల్చరల్: అడవులు, వాటి సమీప ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ ఆదేశించారు. బుధవారం కర్నూలు సర్కిల్ డీఎఫ్ఓలతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు డీఎఫ్ఓ శివ శంకర్‌రెడ్డి, వైఎస్సార్ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, ట్రైనింగ్ డీఎఫ్ఓ శుభం, నంద్యాల సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్ సమీక్షలో పాల్గొన్నారు. అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కలప రవాణాను నిరోధించాలన్నారు. ఎర్రచందనం అపహరణ కేసులను సత్వరం పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ రేంజర్లు పాల్గొన్నారు

టీటీడీ ఆదాయం ఇతర వాటికి వినియోగించొద్దు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) ఆదాయాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తే అడ్డుకుంటామని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హెచ్చరించారు. బుధవారం వినాయక్ ఘాట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ బడ్జెట్‌లో సంవత్సరంలో ఒక శాతం నిధులను తిరుపతి నగర అభివృద్ధికి కేటాయించాలని టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ హిందూ ధర్మ సంరక్షణ, హిందూ ధర్మ ప్రచారం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను ఎలా దారిమళ్లిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మ ప్రసార్ కన్వీనర్ ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి సండడి మహేష్, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, జిల్లా కోశాధికారి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. .


మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

పోలీసు లాంఛనాలతో ఏఆర్ ఎస్‌ఐ అంత్యక్రియలు

కర్నూలు: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఏఆర్ ఎస్‌ఐ దాదెపోగు జమ్మన్న (58) మృతిచెందాడు. బుధవారం సుంకేసుల రోడ్డులోని శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించా రు. 1998లో ఈయన పోలీసు శాఖలో చేరారు. విష యం తెలిసిన వెంటనే పోలీసు అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుతో పాటు ఏఆర్ విభాగం అధికారులు, సహోద్యోగులు కర్నూలు ధర్మపేటలోని ఆయనఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈయనకు భార్య నిర్మలతో పాటు కూతుర్లు హారిక, శిరీష, హైమావతి ఉన్నారు.


జమ్మన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

స్పోర్ట్స్

రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్) : జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య స్పష్టం చేశారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో తైక్వాండో, ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్, లాన్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పాఠశాల స్థాయి క్రీడల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బాషా పాల్గొన్నారు.

15న జిల్లా రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 15 వ తేదీ ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి బైరెడ్డి పక్కిరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వాడ్ స్కేటింగ్ క్రీడాంశంలో రింక్‌రేస్, రోడ్ రేస్‌లలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు ప్రవేశరుసుం, ఆర్ఎస్ఎఫ్ఐ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9010501082 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైకేపీ యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

- డీఆర్‌డీఏ–వైకేపీ పీడీకి వినతి

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ వైకేపీ ఉద్యోగ భద్రత కల్పించేందుకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ వైకేపీ ఉద్యోగుల యానిమేటర్స్ డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషాను కోరారు. నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను చాంబరులో యానిమేటర్స్ కలసి బొకే సమర్పించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ చేయాలని పేర్కొన్నారు. పీడీ స్పందిస్తూ ఈ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటెప్ప, సుంకన్న, కోశాధికారి రంగన్న, వివిధ మండలాల సిబ్బంది పాల్గొన్నారు.


డీఆర్‌డీఏ పీడీకి బొకే సమర్పిస్తున్న యానిమేటర్లు